క్లుప్తంగా

బీసీలను మోసం చేస్తున్న కాంగ్రెస్: రమేష్‌గౌడ్



నర్సాపూర్: అధికార కాంగ్రెస్ పార్టీ బీసీలను మోసం చేసిందని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేష్‌గౌడ్ ఆరోపించారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్ పేరిట బీసీలపై కపట ప్రేమ చూపిస్తుందని విమర్శించారు. కాంగ్రెస్ మోసాలను ఎండగట్టేందుకు బీజేపీ సిద్ధమైందన్నారు. అందులో భాగంగా ఆగస్టు రెండున బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు ధర్నాచౌక్ వద్ద బీసీల పట్ల కాంగ్రెస్ వైఖరికి నిరసనగా ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీసీలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

టీచర్ల డిప్యూటేషన్లను రద్దు చేయాలి



అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్తులు

నిజాంపేట(మెదక్): నిజాంపేట మండల పరిధిలోని నందగోకుల్‌లో ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలోని ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై పంపించవద్దని గ్రామస్తులు జిల్లా అదనపు కలెక్టర్ నగేష్‌కు వినతి పత్రం అందించారు. పాఠశాలలో 55 మంది విద్యార్థులు ఉండగా.. నలుగురు టీచర్లు విధులు నిర్వర్తిస్తున్నారని పేర్కొన్నారు. వారిలో డిప్యూటేషన్‌పై ఇద్దరు టీచర్లను పంపిస్తే తమ పిల్లల చదువులు అర్ధంతరంగా ఆగిపోతాయని, డిప్యూటేషన్లు వెంటనే రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు వడ్ల ప్రవీణ్, జీవన్ రెడ్డి, రాజురెడ్డి, స్వామి ఉన్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి

సీడీపీఓ. హేమాభార్గవి



అంగన్‌వాడీ టీచర్లతో మాట్లాడుతున్న సీడీపీవో

శివ్వంపేట(నర్సాపూర్): అంగన్‌వాడీ కేంద్రాల వద్ద పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సీడీపీఓ హేమాభార్గవి అన్నారు. బుధవారం అంగన్‌వాడీ టీచర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పిచ్చి మొక్కలు ఉంటే వెంటనే తొలగించాలని సూచించారు. సమయపాలన పాటించాలని, పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్య, ఆట పాటలతో విద్యాబోధన చేయాలని కోరారు. పిల్లలకు, గర్భిణీలు, బాలింతలకు ప్రభుత్వం నుంచి ఇస్తున్న నాణ్యమైన పోషకాహారాన్ని ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ సంతోష, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

ఆయిల్‌పామ్‌తో అధిక లాభాలు



కట్టెల వెంకటాపూర్‌లో స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పెద్దశంకరంపేట(మెదక్): ఆయిల్‌పామ్ పంటల సాగుతో రైతులకు అధిక లాభాలు వస్తాయని ఇన్‌చార్జి ఏఓ కృష్ణ అన్నారు. బుధవారం పెద్దశంకరంపేట మండలం కట్టెల వెంకటాపూర్ శివారులో ఆయిల్‌పామ్ మొక్కలను నాటేందుకు స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 90 శాతం సబ్సిడీపై మొక్కలు అందజేస్తామన్నారు. దీంతో పాటు డ్రిప్ సౌకర్యం కూడా ఉంటుందన్నారు. రైతులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఒక ఎకరాకు 57 మొక్కలను నాటుకోవచ్చన్నారు. కార్యక్రమంలో నాయకులు దేవేందర్, ఏఈఓలు అఖిల్, వినీత్, లీవ్‌పామ్ కంపెనీ అసిస్టెంట్ మేనేజర్ జాన్సన్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

సాధికారతకు శిక్షణాలయం

- వనితలకు వివిధ రంగాల్లో ఉచిత శిక్షణనిస్తున్న దుర్గాబాయి మహిళాభివృద్ధి సంస్థ
- ఇప్పటివరకు 10,928 మందికి ట్రెనింగ్



శిక్షణ పొందుతున్న మహిళలు

సంగారెడ్డి టౌన్: గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు ఉపాధి పొందేందుకు వీలుగా వారికి వివిధ రంగాల్లో ఉచిత ఎన్నో ఏళ్ల నుంచి ఉచితంగా శిక్షణనిస్తోంది దుర్గాబాయి మహిళా నైపుణ్యాభివృద్ధి సంస్థ. ఉమ్మడి జిల్లాలోని మహిళల కోసం సంగారెడ్డి పట్టణంలో 1992లో ఈ సంస్థను పది ఎకరాల విస్తీర్ణంలో ప్రారంభించారు. ప్రతీ ఏటా వివిధ రకాల ఉచిత శిక్షణనిస్తూ శిక్షణతోపాటు ఉపాధిని కల్పిస్తోంది. దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రంలో పదవ తరగతి నుంచి మొదలుకుని పై తరగతులు చదివిన బాలికలకు, మహిళలకు హాస్టల్లో వసతి కల్పించి శిక్షణలను తీసుకుంటున్నారు. నిరుపేద మహిళలకు దుర్గాబాయి మహిళా శిశువికాస కేంద్రంలో టైలరింగ్, మగ్గం, కమ్యూనికేషన్, హెల్త్ వంటి రంగాల్లో ఉచితంగా శిక్షణనిస్తున్నారు. సంస్థ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు 10,928 మంది శిక్షణ పొందారు. ఎంతోమంది స్వయం ఉపాధితోపాటు ఉద్యోగాలు పొందారు. ప్రతీ మహిళకు ఆత్మవిశ్వాసం అందిస్తూ, శిక్షణ పూర్తయ్యాక ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కూడా మహిళా ప్రాంగణ అధికారులు కృషి చేస్తున్నారు.

ఎమ్మెల్యేగారూ.. మీకిది తగునా..!

మండల కాంగ్రెస్ నేతల ధ్వజం



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఎమ్మెల్యే సునీతారెడ్డి నిరాధారమైన ఆరోపణలు చేయడం తగదని చిలప్‌చెడ్ మండల కాంగ్రెస్ నాయకులు అన్నారు. బుధవారం మాజీ వైస్ ఎంపీపీ విశ్వంభర మాట్లాడుతూ రేషన్ కార్డుల పంపిణీ సమావేశంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి 60 శాతం కూడా రుణమాఫీ జరగలేదనేది చెప్పడం కరెక్ట్ కాదన్నారు. రూ.2 లక్షల లోపు రుణమాఫీ 80 శాతం వరకు జరిగిందని, సాంకేతిక కారణాలతో 20 శాతం మాఫీ జరగలేదన్నారు. పదేళ్ల పాలనలో ఇవ్వని రేషన్ కార్డులు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిందని గుర్తు చేశారు. ప్రజల సమస్యల గురించి ఎమ్మెల్యే అసెంబ్లీలో మాట్లాడాలేగానీ, ప్రజాకార్యక్రమంలో కాదన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు నారాయణ రెడ్డి మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా నిరుపేదలకు ఇళ్లు ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌దే అన్నారు. సమావేశంలో మండల ఉపాధ్యక్షుడు పండరి, సొసైటీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సుభాష్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు పరుశరాంరెడ్డి, భూమయ్య, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, అఖిల్ పాల్గొన్నారు.

‘పీవోఎస్’ ద్వారానే ఎరువులు విక్రయించాలి

ఎరువుల దుకాణాలను తనిఖీ చేసిన ఏఓ



డీసీఎంఎస్ ఎరువులు దుకాణంలో స్టాక్ తనిఖీ చేస్తున్న ఏఓ స్వప్న

కౌడిపల్లి(నర్సాపూర్): పీవోఎస్ (పాయింట్ ఆఫ్ సేల్) మిషన్‌ద్వారానే డీలర్లు రైతులకు ఎరువులు విక్రయించాలని ఏఓ స్వప్న ఆదేశించారు. బుధవారం మండల కేంద్రమైన కౌడిపల్లిలోని డీసీఎంఎస్, ఆగ్రోస్, మనగ్రోమోర్, భాగ్యలక్ష్మి తదతర ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్, ధరల పట్టిక పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డీలర్లు తప్పని సరిగా పీవోఎస్ మిషన్ ద్వారానే ఎరువులను విక్రయించాలని, రైతు ఆధార్‌కార్డులోని వివరాలు లేదా వేలిముద్రలు తీసుకోవాలని సూచించారు. ఎంఆర్‌పీ ధర కన్నా ఎక్కువకు అమ్మితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎరువుల స్టాక్ వివరాలను ఎప్పటికప్పుడు నోటీస్‌బోర్డుపై రాయాలని తెలిపారు. రైతులు మోతాదును మించి ఎరువులు వాడొద్దని చెప్పారు. ఈ సందర్భంగా డీఏపీ అధిక ధరకు అమ్మినందుకుగాను 21 రోజుల పాటు విక్రయించకుండా నోటీసు ఇచ్చినట్లు ఏఓ తెలిపారు.

పింఛన్‌రాని వితంతువులకు ప్రత్యేక స్కీం: ఎంపీడీఓ



రవీందర్

మనోహరాబాద్(తూప్రాన్): గ్రామాలలో పింఛన్‌రాని వితంతువులు కేంద్రం ప్రవేశ పెట్టిన నూతన స్కీంకు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీఓ రవీందర్ సూచించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 2022 నుంచి వితంతు పింఛన్‌రాని 18–59 వయస్సుగల వారుంటే దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వారికి నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీం ద్వారా రూ.20 వేలు మంజూరవుతాయని పేర్కొన్నారు. అవసరమైన వారు తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో కోరారు. వివరాలకు పంచాయతీ కార్యదర్శులను సంప్రదించాలని సూచించారు.

అంబులెన్స్‌లో ప్రసవం



అంబులెన్స్‌లో జన్మించిన శిశువు

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని చందాపూర్‌కు చెందిన విజయను మెదక్ మాత శిశు కేంద్రం ఆస్పత్రికి తీసుకెళుతుండగా.. మార్గమధ్యలో పురిటినొప్పులు ఎక్కువ కావడంతో అంబులెన్స్‌లోనే ప్రసవించింది. విజయ పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డలను మెదక్ మాత శిశు కేంద్రం ఆస్పత్రికి తరలించారు. ఈఎంటీ నవీన్ యాదవ్, పైలెట్ హరీష్‌ను జిల్లా అధికారులు జానుషాహిత్, కిరణ్ అభినందించారు.

నిజాయితీ చాటుకున్న విద్యార్థిని

చేర్యాల(సిద్దిపేట): ఓ విద్యార్థిని తనకు దొరికిన మొబైల్‌ను పోలీసుల ద్వారా బాధితుడికి అప్ప గించి నిజాయితీ చాటుకుంది. మండలంలోని ముస్త్యాలకు చెందిన దీపిక బాసర ట్రిపుల్‌ఐటీలో చదువుతుంది. ఆమె నిజామాబాద్ నుంచి బస్సులో వస్తున్న సమయంలో ఫోన్ దొరికింది. వెంటనే ఆ ఫోన్‌ను చేర్యాల పోలీసులకు అప్పగించి తన నిజాయితీ చాటుకుంది. టెక్నాలజీ ద్వారా ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తి వివరాలు తెలుసుకున్న చేర్యాల పోలీసులు బుధవారం బాధితుడికి ఫోన్ అప్పగించారు.

పౌరుల హక్కులకు భంగం కల్గించవద్దు



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఎస్ఐ సుభాష్‌గౌడ్

మనోహరాబాద్(తూప్రాన్): ప్రతి ఒక్కరూ కుల మత భేదాలు లేకుండా కలిసిమెలిసి ఉండాలని మనోహరాబాద్ ఎస్ఐ సుభాష్‌గౌడ్ అన్నారు. బుధవారం మండలంలోని రామాయపల్లిలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. గ్రామంలో ఎలాంటి సాంఘిక దురాచారం ఉండవద్దని, రెండు గ్లాసుల పద్ధతికి దూరంగా ఉండాలన్నారు. పౌరుల హక్కులు, వాటి ప్రాధాన్యత, నడుచుకునే విధానం తదితర అంశాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ దీక్షిత్, మాజీ సర్పంచ్ పార్వతి, నాయకులు మల్లేశ్, రతన్‌లాల్, శ్రీనివాస్, బాబుగౌడ్, సాయిబాబ, అప్సర్, నాగరాజు, పోచయ్య, బాలేష్, కేశవులు పాల్గొన్నారు.

కలసిమెలసి ఉండాలి



సీతానగర్‌లో అవగాహన కల్పిస్తున్న అధికారులు

అల్లాదుర్గం(మెదక్): కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ కలిసిమెలి ఉండాలని ఏఎస్ఐ గాలయ్య అన్నారు. బుధవారం మండల పరిధిలోని సీతానగర్‌లో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంటరానితనం పాటించడం నేరమన్నారు. హోటళ్లలో రెండు గ్లాసుల పద్ధతి పాటిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఐ శరణప్ప, పంచాయతీ కార్యదర్శి అనిత తదితరులు పాల్గొన్నారు.

భరతం రాజు సేవలు భేష్

- పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్
- బొడ్మట్‌పల్లిలో హెచ్‌ఎం రాజు పదవీవిరమణ సభ



రాజు దంపతులను సన్మానిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

టేక్మాల్(మెదక్): ప్రధానోపాధ్యాయులు భరతం రాజు ఉపాధ్యాయ వృత్తిలో చేసిన సేవలు అభినందనీయమని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు. అల్లాదుర్గం మండలం మాందాపూర్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం భరతంరాజు పదవీ విరమణ– అభినందనీయ సభ మండలంలోని బొడ్మట్ పల్లి వీరభద్ర ఆలయ ప్రాంగణంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. పీఆర్టీయూ మండలశాఖ అధ్యక్షుడు జనార్దన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాజు దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజు ఒక్కరోజు సెలవుతీసుకోకుండా విధుల పట్ల అంకితభావంతో పని చేశారని కితాబిచ్చారు. ఉద్యోగరీత్యా పదవీ విరమణ సహజమే అయినా.. ఆయన అందించిన సేవలు ఎల్లప్పుడూ గుర్తుంటాయని పేర్కొన్నారు. రాజు సేవలు అందరికి ఆదర్శనీయమని కొనియాడారు. ఎంఈఓ ధనుంజయగౌడ్, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు జనార్దన్, మాజీ జిల్లా అధ్యక్షుడు సుంకరి కృష్ణ, రాందాస్, స్టేట్ అసోసియేట్ ప్రెసిడెంట్ సత్యనారాయణ, సీనియర్ నాయకులు కిష్టయ్య, రంజ్యానాయక్, సహదేవ్, దుర్గయ్య పాల్గొన్నారు.

మందుల వాడకంలో జాగ్రత్తలు తప్పనిసరి



రైతులకు అవగాహన కల్పిస్తున్న అగ్రికల్చర్ విద్యార్థులు

రైతులకు అగ్రికల్చర్ విద్యార్థుల సూచన

చిలప్‌చెడ్(నర్సాపూర్): రైతులు పురుగుమందులు వాడకంలో సరైన జాగ్రత్తలు తీసుకోవాలని మల్లారెడ్డి యూనివర్శిటీ అగ్రికల్చర్ విద్యార్థులు అన్నారు. బుధవారం మండల పరిధిలోని శీలాంపల్లి గ్రామ రైతులకు కేవీకే ఆధ్వర్యంలో గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా పురుగుమందుల వాడకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు ప్రభుత్వ అనుమతి ఉన్న డీలర్ నుంచే పురుగుమందుల డబ్బాతో పాటు లేబుల్ ఉన్నవాటినే కొనుగోలు చేయాలన్నారు. తప్పనిసరిగా రశీదు తీసుకోవాలని సూచించారు. వీలైనంత వరకు డబ్బాలను పిల్లలకు దూరంగా ఉంచాలన్నారు. పిచికారీ సమయంలో మురికినీరు, బురదనీరు కాకుండా శుభ్రమైన నీరు వాడాలన్నారు. పిచికారీ సమయంలో ద్రావణం ఒంటిపై పడకుండా మాస్క్, గ్లౌస్‌లు, కంటి అద్దాలు ధరించి స్ప్రే చేయడం ఉత్తమమన్నారు. అలాగే.. పెంపుడు జంతువులు, పశువులు పొలంలోకి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు చందన, లతాశ్రీ, అక్షయ, భవానీ, దేవిక, భావన, అశ్వినీకుమారి, శ్వేక, రైతులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే..

‘నమస్తే నర్సాపూర్’కార్యక్రమం: రాజిరెడ్డి



నర్సాపూర్‌లో మురికి కాలువను పరిశీలిస్తున్న రాజిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు

నర్సాపూర్: నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని వాటి పరిష్కరించేందుకే ‘నమస్తే నర్సాపూర్’కార్యక్రమం చేపట్టినట్లు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజిరెడ్డి చెప్పారు. బుధవారం రెండోరోజు ఆయన పట్టణంలోని పలు వార్డులలో పర్యటించారు. ప్రజల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి ఆయా శాఖల అధికారులతో మాట్లాడారు. మురికి కాలువలు, రోడ్ల పరిస్థితి, పారిశుద్ధ్య లోపాలు, మౌలిక వసతులపై అయన మున్సిపల్ కమిషనర్ శ్రీరాంచరణ్‌రెడ్డితో చర్చించారు. ఆయన వెంట పార్టీ నాయకులు మల్లేష్, సుధీర్‌గౌడ్, హబీబ్‌కాన్, నగేష్, శ్రీనివాస్ గుప్తా, నరేందర్‌రెడ్డి, రవికుమార్, సురేష్, రషీద్ తదితరులు ఉన్నారు.

తారురోడ్డు వేయాలని నిరసన



రోడ్డుపై నిరసన తెలుపుతున్న యువకులు

అక్కన్నపేట(హుస్నాబాద్): గుంతల రోడ్డుపై ప్రయాణించి ప్రమాదాలకు గురవుతున్నామని గ్రామస్తులు తారురోడ్డు వేయాలని నిరసన తెలిపారు. బుధవారం అక్కన్నపేట మండలం కేశనాయక్‌తండా గ్రామ పరిధిలోని గొల్లపల్లి నుంచి చెరువు ముందు తండా మీదుగా మైసమ్మ వాగుతండా వరకు దాదాపు 2 కి.మీ మేర రోడ్డంతా గుంతలు పడి ప్రమాదకరంగా మారింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన వర్షానికి రోడ్డు పొడవునా గుంతలు పడ్డాయని, ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని వాపోయారు. ఉదయం, సాయంత్రం సమయాల్లో పాల కేంద్రానికి వెళ్లే వారి వాహనాలు అదుపులు తప్పి పడిపోయి గాయాల పాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఏళ్లతరబడి తారురోడ్డు రోడ్డు సౌకర్యం కల్పించాలని పలుమార్లు విన్నవించిన ఎవరు పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. ఇప్పటికైనా రోడ్డుకు మరమ్మత్తు చేసి తక్షణమే తారురోడ్డుకు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. లేని పక్షంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

విద్యార్థుల జీవితాల్లో చెరగని ముద్ర

- ఎంఈవో సేవలు శ్లాఘనీయం
- ఎమ్మెల్యే సునీత



ఎంఈఓ యాదగిరి దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

వెల్దుర్తి(తూప్రాన్): ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరని, విధి నిర్వహణలో కనబరిచిన అంకితభావం, సేవా విద్యార్థుల జీవితాల్లో చెరగని ముద్ర వేస్తాయని ఎమ్మెల్యే సునీతారెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజిరెడ్డి అన్నారు. బుధవారం వెల్దుర్తిలో నిర్వహించిన ఎంఈఓ యాదగిరి పదవీ విరమణ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు ఎంఈఓ దంపతులను శాలువాలతో సత్కరించి అభినందించారు. ఉపాధ్యాయ వృత్తిలో సుమారు 38 ఏళ్ల పాటు ఎందరో విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దిన ఎంఈఓ సేవలు మరువలేనివని పలువురు వక్తలు కొనియాడారు.

సంక్షిప్త వార్తలు

◆ ఐకేపీ ఏపీఎం బదిలీ

కౌడిపల్లి(నర్సాపూర్): కౌడిపల్లి మండల ఐకేపీ ఏపీఎంగా విధులు నిర్వహిస్తున్న సంగమేశ్వర్ బుధవారం బదిలీ అయ్యారు. పదేళ్లుగా ఇక్కడ ఏపీఎంగా విధులు నిర్వహించారు. ప్రస్తుతం ఐకేపీలో బదిలీలు జరుగుతుండటంతో అతను నర్సాపూర్‌కు బదిలీ అయినట్లు తెలిపారు.

◆ జీవన ఎరువులు వాడాలి (సంక్షిప్తం)

చిన్నశంకరంపేట(మెదక్): రైతులు జీవన ఎరువులను వాడటం ద్వారా అధిగ దిగుబడులు సాధించవచ్చని నార్సింగి ఏఈఓ విజృంభణ సూచించారు. రైతులు తమ భూముల సారం కాపాడుకునేందుకు జీవన ఎరువులను వినియోగించాలని సూచించారు. దీంతో నేలలో పోషకాల సమతుల్యత దెబ్బతినుండా కాపాడడంతో పాటు నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం, తునికిలో, అలాగే.. నార్సింగిలోని కృషి రైతు విజ్ఞానకేంద్రంలో కూడా లభించనున్నట్లు తెలిపారు.

◆ నేడు కిచెన్‌షెడ్ ప్రారంభం

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రమైన కౌడిపల్లి ఉన్నత పాఠశాలలో కిచెన్‌షెడ్ లేకపోవడంతో ఎస్ఎంసీ, ఏపీపీ కమిటీ విజ్ఞప్తి మేరకు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ యువ నాయకుడు పోలనవీన్ సుమారు రూ.59 వేలతో కిచెన్‌షెడ్ నిర్మించారు. నిర్మాణం పూర్తి కావడంతో గురువారం ఎమ్మెల్యే సునీతారెడ్డి చేతుల మీదుగా షెడ్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు.

◆ నేడు అంబేద్కర్ విగ్రహావిష్కరణ

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని ఉసిరికపల్లిలో ఎమ్మెల్యే సునీతారెడ్డి గురువారం అంబేద్కర్ విగ్రహావిష్కరణ చేస్తారని బీఆర్ఎస్ నేత కృష్ణారావు తెలిపారు. ఉదయం 11 గంటలకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

◆ చదవడం రాయడం నేర్పించాలి

చిన్నశంకరంపేట(మెదక్): ప్రతి విద్యార్థికి చదవడం రాయడం నేర్పించాలని కాంప్లెక్స్ హెచ్‌ఎం దీప్లారాథోడ్ సూచించారు. బుధవారం చిన్నశంకరంపేట మండలం గవ్వలపల్లితండా ప్రాథమిక పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులచే తెలుగు, ఆంగ్లం చదివించి వారి ప్రతిభను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రతి విద్యార్థికి తెలుగుతో పాటు అంగ్లం చదవడం, రాయడం నేర్పించాలని సూచించారు. అలాగే పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో మొక్కల ఎదుగుదలకు కృషి చేస్తున్న పింకిబాయిని అభినందించారు.

◆ పాదయాత్రను విజయవంతం చేయండి

టేక్మాల్(మెదక్): అందోల్ నియోజకవర్గంలో మంత్రి దామోదర రాజనర్సింహ ఆధ్వర్యంలో ఏఐసీసీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ చేపట్టబోయే పాదయాత్రను విజయవంతం చేయాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నిమ్మ రమేష్ కోరారు. ఆగస్టు ఒకటో తేదీన సంగుపేట నుంచి జోగిపేట్ కాంగ్రెస్ పార్టీ ఆఫీస్ వరకు ఈ పాదయాత్ర జరుగుతుందని తెలిపారు.

◆ ఉచిత వైద్య శిబిరం విజయవంతం

హుస్నాబాద్: మున్సిపల్ కార్యాలయంలో బుధవారం కరీంనగర్ మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మున్సిపల్ అధికారులు, సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్, ఈసీజీ, 2డీ ఎకో పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో 380 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. మున్సిపల్ ఉద్యోగులకు సీపీఆర్ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, ఆస్పత్రి సెంటర్ హెడ్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

◆ ఈత మొక్కలు నాటిన అధికారులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా బుధవారం సిద్దిపేట పట్టణ పరిధిలోని నర్సాపూర్‌లో జిల్లా ఎక్సైజ్ అధికారులు మొక్కలు నాటారు. 100కు పైగా ఈత మొక్కలు నాటారు. కార్యక్రమంలో టూ టౌన్ సీఐ ఉపేందర్, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, మున్సిపల్ వైస్ చైర్మన్ కనకరాజు, కౌన్సిలర్‌లు నాయిని చంద్రం, యోగి, కోరె ఎల్లయ్య, రాములు పాల్గొన్నారు.